# గృహమే కదా స్వర్గసీమ

కారుదిగి టకటక యింట్లోకి వచ్చి, స్టెతస్కోపూ, మెడిసిన్ చెస్టూ బల్లమీద దిగవిడిచి, టై విప్పుకుంటూ డ్రాయింగ్ రూము దాటి గదిలోకి వచ్చాడు సోమశేఖరం

ఆయా మరియమ్మ అప్పుడే పాప సుగుణ ప్రక్కన తలగడ పెట్టి, అవతలికి వెళదామని కాబోలు లేస్తున్నది. రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయేడు సోమశేఖరం.

ఆయా కూడా యమజాని రావడంతో ఒదిగి అక్కడే నించుండి పోయింది.

"అమ్మగా రేరీ? మరియా!"-అతను పాపదగ్గిరగా వెళ్లి, నిద్దురపోయే చిన్నారి మోము నొక్కసారి నిమిరి అడిగేడు.

"ఇవాళ సాయంత్రమే ఏదో సమావేశం అని చెప్పి వెళ్లేరు బాబూ! మిమ్మల్ని దింపగానే కారు తెమ్మని డ్రైవరుకి చెప్పేరండీ" వినయంగా చెప్పింది మరియా.

"చిట్టితల్లి పోరుపెట్టకుండా పడుకున్నదా" అతని కంఠంలో ఆవేదనా, విసుగూ రెండూ ధ్వనించేయి.

ఆయా ఏం చెప్పగలుగుతుంది? నిజం చెబితే యింటి యిల్లాలికీ యజమానికి దెబ్బలాట తప్పదు. అది తన వుద్యోగానికంత క్షేమమూ గాదు. "లేదండీ"అన్నది.

'ఉస్సుర'ని సోమశేఖరం డ్రెస్సింగ్ రూంలోకి పోయేడు. శారద బి.ఏ. చదివిందని ముచ్చటపడి కట్టుకున్న సంగతి తల్చుకుంటే పీక పిసుక్కుంటున్నట్లు వుంటుంది.

తను డాక్టరు. ఎనిమిది గంటలు వుద్యోగం చెయ్యడం... ఆ తర్వాత ఓవర్ టైం అనడం, ఆదివారాలు హాయిగా నిద్దరపోయి వుదయం తొమ్మిదిగంటలకి లేవడం లాంటివి వుండవు సరిగదా, ఇరవై నాలుగు గంటల్లో ఏ క్షణాన ఐనా ధర్మానికి, వృత్తిరీత్యా వున్న బాధ్యతకీ కట్టుబడవల్సిందే.

తను ఎంబిబియస్ అయినందుకు తనకు రాబోయే ఇల్లాలు కనీసం బి.య్యేనో, బి.య.స్సీవో అవకపోతే ఎలాగ అని ఆరాట పడ్డాడు సోమశేఖరం సుమారు ఆరేళ్లక్రితం.

తన కోరిక ఫలితంగా తన తండ్రి, తల్లి మాట కాదని యీ సంబంధం స్థిరపరచేడు.

శారద బి.ఏ. చదివింది. ఎర్రని ఛాయ. నిండైన విగ్రహం, మంచి సంప్రదాయం అనుకొని సోమశేఖరం తల వూపాడు.

తల్లి మూడేళ్ల క్రితం వరకూ, ఇక అర్నెలకు ఇహలోకయాత్ర చాలిస్తుందన్నంత వరకూ 'నా మాట కాదన్నావ్ నా అన్న కూతుర్ని కాలదన్నావ్... ఈ చదువుకున్న సరస్వతిని కట్టుకున్నావ్... నీ పిల్లల గతేమవుతుందో నీకిప్పుడు తెలీదురా అబ్బాయ్..." అని హెచ్చరిస్తూ నేవుండేది.

నిజంగా అతగాడికి యిప్పుడు పిల్లల గురించే బెంగగా వున్నది. శారద అంటే అతను ప్రాణం పెడతాడు. పోతే ఆమె కూడా కాస్త డాంబికానికి దర్పానికి పాటుబడే పిల్లతప్ప... తతిమ్మా ఏ విషయంలోనూ, ఆమెకి వంకలు పెట్టడం యెవరికీ తరంగాదు.

సోమశేఖరం పెళ్లి అతను వుద్యోగంలో జాయినయిన ఏడాదే అయ్యింది.

శారద రాకతోనే అతని అదృష్టం పుష్పించింది.

మలి సంవత్సరమే అతగాడు ప్రాక్టీసు పుంజుకుని వుద్యోగం వదిలేసేడు.

శారద తండ్రి ఆగర్భ శ్రీమంతుడు. ఆమెకి ఒక కారు కూడా అరణమిచ్చేడు.

ఆమె మొదటినుంచీ చాలా సర్దాలు వున్న పిల్ల. పిక్‌నిక్‌లూ, షైర్లూ తిరగమనేది భర్తని, అతను కూడా రెండేళ్లు చాలా హాయిగా దొర్లించేసేడు.

అటు తర్వాత పెద్దవాడు రఘు పుట్టడం... తన ప్రాక్టీసు గూడా ఎక్కువ అవడం చేత, తీరిక లేమి శారదనే వొంటరిగా క్లబ్బులకీ, షికార్లకీ పొమ్మనేవాడు కూడానూ.

శారద అల్లరి పెట్టి ఆయాను పెట్టింది రఘూకి. ఇప్పుడు రఘూకి నాలుగో ఏడు. ఐనా వాడు అంత ఎత్తిర్లలేదు. పీలగా నజ్జుగా వుంటాడు.

తరువాతది సుగుణ. దీనికి పూర్తిగా ఆయా పెంపకమే అయింది. దరిమిలాన శారద మహిళామండలి సెకరట్రీ అవడమే అందుకు కారణం.

సోమశేఖరం ఆలోచిస్తూ డైనింగ్ టేబిల్ దగ్గర కూచున్నాడు.

ఇదంతా శారద చేసిన కృత్రిమమైన జీవితం అనుకొని విసుక్కున్నాడు.

మంచి టైలరు కుట్టిన యింగ్లీషు సూటు తన వొంటిమీద హత్తుకొని అమరినట్లు, తతిమ్మా అన్ని విదేశీ నాగరికతలు మనకి అబ్బవు... మనపట్ల రాణించవు. ఏమిటో శారదకి తను చదువుకున్నాను... తన హక్కులూ వీటి గొడవ తప్ప యింకేమీ తెలియవు. జుట్టులోనికి వేళ్లు పోనిచ్చి కూచున్నాడు సోమశేఖరం.

ఇంతలో అవతల కారు ఆగడం తర్వాత తలుపు దభేలున వేసిన చప్పుడవడం... మరికొన్ని

క్షణాలకు శారదా, ఆమె వెనక రఘు నెత్తుకుని డ్రైవరూ లోపలికి వచ్చేరు.

సోమశేఖరం ఏమీ మాట్లాడలేదు. తీవ్రంగా శారదకేసి చూసేడు. ఆమె హైర్‌పిన్నులు తీసి డ్రెస్సింగ్ టేబిల్ మీద పడవేస్తూ "మీరింకా భోంచేయనేలేదా... నాయర్ వడ్డించేసే వాడేనే" అన్నది.

"బాబు నెందుకు తీసికెళ్లావు... వాడి హెల్త్ అసలే డెలికేట్ అని తెల్సుకదా నీకు?"

ఆమె భోగట్టాకి సమాధానంగా శేఖరం వేసిన ప్రశ్న అది.

"మరి ఏం చెయ్యనేమిటి? వెళుతున్నప్పుడు వాడు వొకటే మంకుపట్టు పడితేనూ... అయినా యిప్పుడు వాడికి కలిగిన స్ట్రెయిన్ యేమిటీ?" అని బాబుని పడుకోపెట్టి నించున్న డ్రైవర్‌కేసి తిరిగి "ఉదయం ఏడు గంటలకే కారు రెడీ చెయ్యాలి.... నువ్వు వెళ్లు" అని చెప్పింది.

భర్త ముట్టుకుంటే పేలిపోయే బాంబులాగ కూచోడం చూసిన శారద యేమి మాట్లాడకుండా వడ్డించింది.

పూర్తిగా నాలుగు ముద్దలు మింగకుండానే అతను ఆగి "నువ్వు యిద్దరి పిల్ల తల్లివయ్యేవ్ శారూ.. ఇంక ఆ క్లబ్బూ, సెక్రటరీ షిప్పూ వదిలేయకూడదూ" అని నిష్కర్షగా అన్నాడు.

"పిల్లలు పుట్టేరని క్లబ్ మానమనడం భావ్యంగా లేదండీ మీకు... ముందు భోజనం చేయండీ... ఆనక అన్నీ మానేయమందురుగాని" మరింత నెయ్యి వడ్డిస్తూ పొడిగా నవ్వి, ఆవిషయాన్ని తేలికగా నెట్టేద్దామని చూసింది.

ఐతే అది సాధ్యం అవనిపని అని గ్రహించడానికి ఆమెకి యెంతోసేపు పట్టలేదు. అతను చాలా సీరియస్‌గా వున్నాడు.

"నువ్వు క్లబ్బులకి వెళ్లీ, షైర్లకీ వెళ్ళి యీ పిల్లల్ని బాధ్యతా రహితంగా వదిలేయడం చూస్తే... నాకీ ప్రక్టీసు వదిలేసి యింట్లోనే వుండిపోదామనిపిస్తూంది..." చెయ్యి కడుక్కుని లేచి పోయాడు సోమశేఖరం.

"సరే .... మీ యిష్టం బాబూ! అయినా నేనేం పిల్లల్ని అశ్రద్ధ చెయ్యడం లేదు... ఆయా దగ్గిర పెరిగినంత మాత్రాన వాళ్లని నేను నెగ్లెక్ట్ చేస్తూన్నానని అనుకోడం బావులేదు..."

శారద సాక్ష్యం లేకుండా వాదిస్తున్న లాయర్‌లాగ సమర్థించుకో జూసింది.

"లేదు శారదా... నీకు తెలీదు... యీ వయస్సులో పిల్లలకి కావల్సినది తల్లి మమత, తండ్రి వాత్సల్యమూను.. నువ్వు క్లబ్బులనీ, స్త్రీ జనోద్ధరణ అనీ.... నేను కేసులనీ తిరుగుతూ వుంటే.. మన యిద్దరికీ సుఖం లేకపోగా... పసివాళ్లిద్దరి భవిష్యత్తూ కంటకప్రాయ మవుతూన్నది..." భార్యకి బోధపరుద్దామని ప్రయత్నం చేసేడు.

అంతలో సుగుణ లేచింది. శారద దాన్ని పడుకోబెట్టి బుజ్జగింప జూసిందిగానీ... అది కింక వదల్లేదు. సోమశేఖరం ముందుకి వొంగి బిడ్డని తన భుజం మీద వేసుకున్నాడు.

ఆ పసిది తండ్రి వొంటి వెచ్చదనం గుర్తించినట్లు, భుజం మీద వాలి నిద్దరోయింది.

శారద ఏమీ మాట్లాడలేదు. రఘు మంచం మీద కూచున్నది!

నిజమే బాబు రోజు రోజుకీ చిక్కిపోతున్నాడనుకుంది.

పోనీ తనీ పిల్లలు, సంసారం అని చూసుకుంటూ యింటి పట్టునే వుండిపోయి మండలీ ఆదర్శాలూ వదులుకుంటే...

దానికీ యీ జ్ఞానం లేని పిల్లలు చిక్కిపోవడానికీ ఏమైనా సంబంధం వున్నదా? లేక కేవలం భర్త, అందరి భర్తలకు మల్లే తననూ కాళ్లూ చేతులూ కట్టి యింట్లోనే పారేద్దామని యిలాగ అల్లరి పెడుతున్నారా? అని ఆమె తర్కించుకో చూసింది.

తను సాయంత్రం పురుషులు వాళ్ళ మూర్ఖమయిన నిబంధనలూ, వాటివల్ల కొత్త కాపురాల్లో కలిగే కలతలూ వివరిస్తూ సుదీర్ఘమైన వుపన్యాసం యిచ్చింది.

ఆ కరతాళధ్వనులు యిప్పటికీ యింకా ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి. అక్కడ తను తన యింటి వ్యవహారం గురించి ఆలోచించనూలేదు, మాటాడనూ లేదు.

శారద తన భర్తని ఎంతైనా ప్రేమిస్తుంది. కాని ఆమెకు గల రకరకాల ఆదర్శాలూ, ప్రిన్సిపల్సూ అడుగడుగునా తన గృహస్థ జీవితంలో కంటకప్రాయమవుతున్నాయి. అలాగే నెట్టుకుని వస్తున్నది.

పిల్లలు ఎప్పుడూ తల్లిదగ్గరే వుంటే వాళ్లకి విసుగు జనించడం, విలువ తగ్గిపోవడం జరుగుతుందనీ అలాగ గాకుండా వాళ్లకి ఎప్పటికప్పుడు ఒక వింత అనుభూతి, ఒక కొత్త దనం యివ్వడానికి సాధ్యమయినంత ఎడంగా వుంచడం అవసరమనీ అంటుంది శారద మనస్సు.

"నన్ను ఆయా పెంచలేదు. మా అమ్మ కారులో క్లబ్బులకి వెళ్ళనూ లేదు... మా నాన్నగారు మాకు టేబిల్ మీల్సు పెడితేనేగాని యింగ్లీషు అబ్బదనీ ఎం.బి.బి.యస్. అవననీ కలలో కూడా అనుకుని వుండరు" సోమశేఖరం యిలాగని చాలాసార్లు శారదని వెటకారం చేసేవాడు. ఆమె ప్రిన్సిపల్స్‌ను తృణీకరించేవాడు.

అందులోని నిజా నిజాలు గుర్తించడం శారదకి వుక్రోషంలో సాధ్యమయ్యేది కాదు.

సోమశేఖరం పాపనెత్తుకుని పచార్లు చేస్తున్నాడు. అతను మధురమైన ఆ పసిదాని స్పర్శలో కోపము అలసటా అన్నీ మరిచిపోయేడు.

అంతలో టెలిఫోను మ్రోగింది.

డాక్టరు శేఖరం 'సెరికిన్ జెప్పడు' లాగ వెళ్ళిపోయింతర్వాత శారద 'ఉస్సుర'ని నిట్టూర్చింది.

పగలు ఎలాగా పగలే... గడియ పొందికలేదు. ఇక రాత్రుళ్లూ యిదీ వరస అనుకుంది.

ఆయా పెంపకం, తల్లి వాత్సల్యం యింత పిసరైనా దొరకకపోడం, బాబు చిక్కిపోడానకీ, నజ్జుతనానికీ కారణమని సోమశేఖరం నమ్మకం. తను యివ్వగల యింజక్షన్లుగాని మందులు గాని వాడి

మహావ్యాధిని కుదర్చలేవు.

ఐతే బాబు తల్లినే అనుసరించి వుండడంగానీ, తల్లికోసరం వాడు బెంగపడతాడన్న బాహ్య చిహ్నాలుగానీ కనిపించవు.

అందుచేతనే శారద ఒక వేళ భర్త తన విరభ్యుదయవాదిత్వాన్ని యీ సాకుతో కప్పిపుచ్చలేదు గదా అనుకుంది.

ఆమె మాత్రం తల్లికాదా? ఆమెకి మాత్రం పిల్లలంటే మమకారం వుండదా?

కాని శారదకి తాను మహిళాలోకాన్ని ఉద్ధరిస్తున్నాను అన్న గర్వంతోనూ, పదేపదే భర్త తనతో పిల్లల విషయం మీద వాగ్యుద్ధానికి తలపడడం చేతా, అది మరింత మరుగున పడిపోయింది.

రాత్రి రెండు గంటలకి కాబోలు తిరిగి వచ్చి పడుకున్నాడు సోమశేఖరం. అయినా వుదయం ఏడుగంటలకి అలారం విన్నవాడిలా లేచి పోయేడు.

లేస్తూనే మగుణ పక్కన చేరి పసిదాన్ని పలకరించి ఆడుకోడం మొదలెట్టాడు.

అంతలో వంటవాడు కాఫీ తెచ్చి అందివ్వగా, అది అందుకుంటూ, అప్పుడే బాత్ రూం కేసి వెడుతున్న శారదకి వినిపించాలన్నట్లు పసిపాప మగుణ నుద్దేశించి శేఖరం అన్నాడు.

"తల్లీ! మన ఖర్మరా! .... మిమ్మల్ని ఆయా పెంచుతుంది....నాకు వంటవాడు తిండిపెడతాడు... ఇంక మీ అమ్మని ఎందుకు కట్టుకున్నట్లు.... చెప్పాతల్లీ నువ్వైనా మీ అమ్మకి బుద్ధి చెప్పు"

అయితే మీకు వంటకీ, మీ పిల్లల పెంపకానికీ తెచ్చుకున్న దాసీదాన్నన్నమాట నేను... నా హక్కులు అవసరాలు లేవన్న మాట? అని విసుక్కుంది శారద. కాని భర్తకి వినిపించనంత జాగ్రత్తగా విసుక్కుంది.

తిరిగి ఎనిమిదిన్నర గంటలవేళ బాబునీ, పాప మగుణనీ ఆయాకి జాగర్త చెప్పి వొప్పగించి వెడుతున్న వేళ సోమశేఖరం చాలా కోపంగా 'శారదా' అని అరిచి "నువ్వింకా యిలాగే చేస్తూ వుండు.. యీ సంసారంగతి ఏమవుతుందో చూద్దువుగాని" అన్నాడు.

శారదకూడా వెడుతున్నదల్లా వెనుదిరిగి బుసకొట్టినట్లు 'బెదిరించడం చెల్లిందికదాని మరీ దాసీదానిలాగ చూడకండి' అని సమాధానం చెప్పి మరీ గుమ్మందాటింది.

'నీ మీద నాకున్న అభిమానమే అను, మోజే అనుకో అది నిలుపుకున్న కొద్దీ నాకు బాధతప్ప సుఖంలేదు.... పోతేపోనీ.... నా సుఖం సంగతి వదిలేయ్. యీ కుర్రకూనల్ని యెందుకు కన్నామో... వాళ్లపట్ల మన బాధ్యత యెటువంటిదో గుర్తించు.... మీ మహిళా మండలి సభ్యుల్ని.... యీ ప్రశ్నవేసి మరీ యింటికిరా...."

చరచరా అవతలికి విసురుగా వెళ్లిపోయేడు.

శారద కారులో కూచుని దభేలున తలుపు వేసుకుని, మహిళా మండలి భవనం ముందు చిరచిరలాడుతూ దిగింది. అప్పటికీ ఆమె మనసు కుదుటపడలేదు.

నాడు పిల్లలూ - పెంపకం అన్న విషయంమీద, స్త్రీజనోద్ధారణ సంఘాధ్యక్షురాలైన ప్రఖ్యాత 'శకుంతలా సరళో' మాట్లాడింది.

శారద మనసు అక్కడ లేదు. ఆమె ధ్యాస అంతా తన పిల్లలి మీదికే వెళ్లింది. మధ్య మధ్య భర్త సాధింపు గుర్తుకురాగా, ఆమె ఆ ఆలోచననించే తప్పించుకుందామని ప్రయత్నించింది.

తిరగివస్తూనే బయట డిస్పెన్సరీ గది ఖాళీగా వుండడం లోపల అంతా సద్దుమణిగి వుండడం చూసి బిడియపడింది.

ఆయా మరియమ్మ అగుపించలేదు. వంటవాడు కనిపించడు. "నాయరూ" అని కేకవేయగా వాడు వచ్చి "అయ్యగారు బయటికి వెళ్లేరమ్మా" అన్నాడు.

"నీ మొహంలాగుంది.. మరి పిల్లలేమయ్యారు... ఆయా ఎక్కడ చచ్చింది... పదకొండున్నర అయ్యిందే వంట ఎక్కడ తగలెట్టావ్?"

వాడు శారద తీవ్రధోరణికి తీక్షణ దృక్కులకీ తట్టుకోలేక నసుగుతూ... "అయ్యగారు . . . అయ్యగారు వద్దన్నారండీ... హోటేల్లో తింటారుటండీ" అన్నాడు.

శారదకి వుక్రోషమూ, అవమానం చేత కలిగిన బాధ పెనవేయగా ఉచ్ఛ్వాస నిశ్వాసాల వడి ఎక్కువయ్యింది.... మాట పెగల్లేదు. మొహం కోపంతో ఎరుపై అంతలో నిస్సహాయతా. అవమానమూ చేత నల్లగా కళా విహీనమైపోయింది.

నాయర్‌ని అవతలికి పొమ్మని అలాగే మంచంమీద వాలి పోయింది.... భర్త ఎదురుగా వుంటే ఆమె వాదించీ సాధించీ కేకలు వేసేదేమో గాని ఎవరూ ఎదుటలేమి, ఆమెకళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి!

ఆమె అలాగ ఐదు క్షణాలు వున్నదో లేదో, సోమశేఖరం యిద్దరు పిల్లలను తీసుకుని వచ్చాడు.

'నాయరూ' అని కేకేసి వాడిచేతికొక రెండు రూపాయల కాయితం యిచ్చేడు.

"మీ అమ్మగారికి కావాలంటే కారియరు తే, లేదా నువ్వు తినిరా ఫో" అన్నాడు.

శారదకి తల తీసినట్లయింది. అహంకారంతో తోకతొక్కిన వెయ్యిపడగల నాగయింది.

ఆమె యిప్పుడో గడియకో పగిలే అగ్ని పర్వతంలా వున్నది. మాటాడలేదు.

సుగణనీ బాబునీ కూడా చేరదియ్యలేదు. వాళ్ళు దగ్గిరికి రాగా. చీమలు ప్రాకుతూవుంటే దులుపుకోలేక నిర్వంగా వూరుకున్నట్లు వూరుకున్నది.

ఎంత సాహసం...

తనని నేతిలో ఈగని తీసిపారేసినట్లు పారేసి, యెంత అవమానం చేసేరు? ఛీ యీ మగాళ్ళ రౌర్జన్యాలు మండా... ఈ బానిసత్వం కన్న నరకం మేలు. చావడం నయం...

భోజనం చేస్తానా?... ఈ యింటికి తిండిలేక మొహం వాచి చేరేననుకున్నారు కాబోలు... లక్షలు మూలుగుతున్నాయి మా తండ్రి యింట.... ఛీ అక్కడకయినా పోవాలి... అదీ యింతకు రెండింతలయిల్లేనూ. యిదుగో యీ కుర్రకుంకలొకరు కదా... అందుకే ఆయన కంత నిర్లక్ష్యం...

ఆమె బాధపడినకొద్దీ ఆలోచన చేసిన కొద్దీ వెలితి యెక్కువ కాజొచ్చింది.

సుగుణ ఆమె రొమ్ములో తలదూర్చి "ఈం ఈం' మని పొడుస్తున్నది. బాబు ఆమె నడుం మీద తల ఆన్చి ముందుకు వొంగి. ఎర్రనైన ఆమె కళ్లలోకి బేలగా చూస్తున్నాడు.

శారద ఒక్కసారి ఉద్వేగంతో పిల్లలిద్దర్నీ తనకి శక్తి వున్నంతవరకూ ఎద నదుముకుంది.

భర్తమీద బుసలు కొడుతూ... అతగాడు బయటికి వెళ్లేదాకా దీర్ఘంగా ఆలోచిస్తూనే వుంది.

ఒక నిర్ణయానికి వచ్చింది. మరి తర్కించలేదు!

ఇదే సమస్య మరివొకరికి వచ్చి తన సలహా అడిగితే ఏం చెప్పేదో అదే తనూ చెయ్యాలనుకుంది.

"వుహ్ం... తన యింట తన మాట చెల్లక తనంటే యెంత నిర్లక్ష్యం?"

అది తల్చుకుంటేనే వెన్నెముక కరిగిపోయి శరీరమంతా కుప్పకూలిపోతున్నట్లవుతున్నది.

కారు తీసుకున్నది. డ్రైవరునుద్దేశించి "నువ్వు మీ అయ్యగారి నౌకరువి... ఈ కొంప యీ సర్వస్వం మీ అయ్యగారిది... నెత్త నెట్టుకుని వూరేగమను" అని తన పిల్లలిద్దర్నీ అందులో వేసుకుని పుట్టినింటికి పోయింది.

శారద తండ్రి జమీందారు కాడు గాని చిన్న పిల్ల-జమీందారీ వున్నంత శ్రీమంతుడు. ఒక కొడుకునింగ్లాండూ, మరో కూతుర్ని ఇండియాలోని బెనారసూ పైచదువులకి పంపించేడు.

రామా కృష్ణా అనుకుంటూ కాదుగాని భూమి పుట్రా, ఆదాయమూ గట్రా చూసుకుంటూ వుండడమే అతగాడి వ్యాపకం.

కూతుర్ని అకస్మాత్తుగా చూసి కొంచెం నివ్వెరపడి.. అంతలో సర్దుకుని సంబరపడి మనుమల్ని ముద్దాడి, కూతుర్నుద్దేశించి "ఏం? దేశోద్ధారణ కోసరం మీ ఆయన అర్జెంటు కేసుమీద వెళ్ళాడా ఏం... తానై రాలేకపోయాడు సరే పోనీ డ్రైవరెక్కడ చచ్చేడు?" అని అడిగాడు.

అక్కడ సోమశేఖరం మిన్ను విరిగి మీదపడ్డట్లు ఫీలయ్యేడు. అంత పని చేస్తుందనుకోలేదు. ఏంత దారుణం...?

"ఎంతకైనా తగును? ఆఖరికి చిట్టితల్లిని కూడా తీసుకు పోయిందన్నమాట. సరే వెళ్లమను ఎంతదూరం వెడుతుందో?" అని బాధపడ్డాడు.

"తన కారు లేకపోతే వెనకటికి ముసలమ్మ-కుంపటీ కథలాగ నేను బ్రతకలేననుకుందాం ఏం...వుహ్" అని విసుక్కున్నాడు.

వారం రోజులు బరువుగా వొక యుగంలాగ దొర్లాయి అతగాడికి.

చిట్టితల్లి ఎలా వుందో... ఛీ దీన్ని పీకె పిసికినా పాపం లేదు... బాబు ఎలా వున్నాడో... అక్కడ మాత్రం యిది వీళ్ళ సంరక్షణ చేస్తుందీ అన్న నమ్మకం యేమిటి!

శారదకి నాలుగు రోజులు తిరక్కుండానే మహిళా మండలినించి వుత్తరం వచ్చింది.

బాధ్యతలను వదిలి వెళ్లిపోవడం, అదీ అర్ధ్యమధ్యంతరంగా వెళ్లిపోవడం భావ్యంగా లేదని దాని సారాంశం.

శారదకీ కూడా ఆవిషయంలో చెయ్యి విరిగినట్లయింది. ఎంతైనా బాధపడింది.

ఐతే ఆమెకి యిరవైనాలుగ్గంటలూ పిల్లలతోనే గడిచి పోవడంతో ఒక క్రొత్త అనుభూతి, వింతదైన అవ్యక్తానందం, అనుభూతికి వచ్చింది.

నిజంగా ఆయన అన్నట్లు బాబుకి బెంగ వున్నదేమో... వాడీమధ్య చెంగు! చెంగున గెంతుతూ, తన మెడచుట్టూ చేతులు వేసి 'వదల్రా' అని విసుక్కున్నా కూడా వదలకుండా గుమ్మాడాడ్డం... పరిగెత్తి వచ్చి వళ్లో గభాలున చతికిలబడి, తన మొహంలోకి చూస్తూ నేనెంత ఘనకార్యం చేసేనో అన్నట్లు చూడడం... మునపటి నజ్జుతనం వాడిలో మచ్చుకైనా లేకపోవడం ఆమెని ఆశ్చర్యంలోనూ, ఆనందంలోనూ ముంచి వేసేవి.

ఐతే పాప మాత్రం నలతగా వున్నది. కొంపదీసి యిదిగాని ఆయనకోసం బెంగ పెట్టుకోలేదు గదా?...

ఆయన కివేం పట్టవు. ఎంతసేపూ నన్ను నీబాధ్యత తెలీదు... అని వేధించడమేగాని, అయ్యో పాపం సుగుణ తన గురించి బెంగ పడుతుంది అన్న జ్ఞానమే లేకపోయె... ఛీ! చదువుండగానే సరా..." అనుకుంది.

చదువు?

అది తనకీ వుంది.

తనూ సైకాలజీ చదువుకుంది... మరి సార్ధకమేదీ...

ఆమెకి మహిళామండలి కూడా ఒక సమస్య అయింది.

ఆమె లోపలినించి యెవరో చదువుకున్నదానివి... తోటి స్త్రీ జాతి హక్కులను వుద్ధరించవల్సిన దానివి... నువ్వే బాధ్యత వొదిలి, యిలాగ వెళ్లిపోతే నిన్నేమనాలి... అని నిలదీసేరు.

అబ్బ అక్కడ వుంటే ఆయన బాధ్యత అని కాల్చుకుతిన్నారు. ఇక్కడికి వస్తే యీ అంతరాత్మ

గోల...

ఈ పిల్లల్ని తీసుకుని ఎక్కడికేనా పారిపోదునా? అనుకుంది.

అంతలో రఘు పరిగెత్తివచ్చి వొళ్లో కూచోగా చికాకుపడి విదిలించుకుంది.

ఆ వెనకాలే తండ్రి "ఏమిటమ్మా... శారదా... యీ కుర్రది నలతగా వుంది... చిక్కిపోయినట్లుంది... అదీగాక మీ ఆయన్ననాలి. కనీసం వుత్తరం ముక్కయినా రాయలేదు... అసలింతకీ నువ్వేం చెప్పవూ? ఏమైనా అల్లుడు పెద్ద పెద్ద మాటలు ఆడాడా ఏం?" అని కనుబొమ్మలెగరేసి అడిగేడు.

ఆయనకి తన రూపాయలమీద చాలా నమ్మకముంది.

శారద "లేదు నాన్నగారూ...నేనే వచ్చేను చూసిపోదామని" అని వూరుకుంది. ఆమె తన వుద్వేగాన్ని దాచాలని చాలా ప్రయత్నం చేసింది.

"అది సరే... వచ్చేవు... రాకపోతే నేనే కబురెడుదుననుకో... కాని, మీ ఆయనకి బుర్రలేదు అంటాను... లేకపోతే యింత ఎదిగీ, యింత చదివీ తన బాధ్యత తెలియొద్దూ... పెళ్ళాం పిల్లల యోగక్షేమం తెలుసుకోలేనివాడు దేశోద్ధరణ అంటూ యేమి వెలగబెడతాడూ అంట..."

శారద తన భర్తని, తాను ధిక్కరించి, తిరస్కరించి వచ్చిన భర్తని, తనను నిర్లక్ష్యం చేసేడని యింత వరకూ తను నిరసిస్తున్న భర్తని తండ్రి నిందించేసరికి గిలగిల్లాడిపోయింది!

కత్తి పుచుకుని యెవరో తన హృదయ కుహరంలో పొడిచినట్లు ఫీలయింది.

ఆమెకి తర్కించుకున్న కొద్దీ, మథనపడ్డకొద్దీ, ఆడదానికి బాధ్యతలేగాని హక్కులెక్కడివీ... అనిపించింది.

అసలు హక్కులూ బాధ్యతలూ వీటి మధ్య గీత ఏమిటీ, అర్థం వున్నదా? అన్న సమస్య తేలిందికాదు.

పాప యీడిగిలపడి కింక పెడుతున్నది. శారదకది పరధ్యానంలో వినిపించిందేగాదు.

ఆమె యిటు వులిక్కిపడి చూసేసరికి పాప నెత్తుకుని ఆరడుగల విగ్రహం సోమశేఖరం నించుని వున్నాడు.

ఆమె తలయెత్తి అతని కేసి అతి ప్రయత్నం మీద చూసేసరికి ... అతను పాప ముక్కూ మొహం ఏకమయ్యేలాగ తనివిదీరా దాన్ని ముద్దు పెట్టుకోడంలో నిమగ్నుడై వున్నాడు.

మాటాడుదామనుకున్న అయిదారు క్షణాలకి ఆమె పెదాలు విడిపడ్డాయి.

"జ్ఞాపకం వచ్చానా ఏం?"

"ఊహుఁ లేదు... యిదుగో మా చిట్టితల్లిని చూసిపోదామని వచ్చేను.... వుండబట్టలేక... నువ్వు నీ హక్కుల పోరాటం నిర్విఘ్నంగా సాగనీ... అది తెలికనే అనుకుంటాను. నేను వస్తూ వుంటే మీ క్లబ్

ప్రెసిడెంట్ ఎదురువచ్చి 'స్త్రీలూ, హక్కులూ" అన్న నీ వ్యాసం రాస్తున్నావా..? అని నన్ను అడిగింది... సోది అడగమని సలహా చెప్పి వచ్చా..."

అంతలో బాబు రివ్వున వచ్చి ఆతని కాళ్లకి పెనవేసుకున్నారు. శారదకాదృశ్యం పరమానందం ఇచ్చింది.

"సరే తల్లీ నే వస్తామరి... ఏది నాన్నా? బాబూ? " అంటూ పాపని దింపి... బాబుని తప్పించుకో జూసేడు సోమశేఖరం.

శారద చిరుకోపం ముక్కుమీద చిందులు వేయగా "పదండి వెడదాం... వస్తామని చల్లగా జారుకుంటున్నారే... బాధ్యత అని ఒకరికి చెప్పడమే గాని... తాము చెయ్యడం లేదన్నమాట?" అన్నది పాపనెత్తుకుంటూ.

శారద పూర్తిగా గతమంతా మరిచిపోయింది. ఆమె కళ్లలో మిలమిలా వింత కాంతులు మెరిసేయి.

"ఓ అవును... అన్నట్లు మీ మండలి కూడా అక్కడ వీవ్యాసాలు లేక దొర్లుతున్నది...చలో శెకరట్రీ" అన్నాడు నవ్వుతూ శేఖరం. మళ్లీ కొంచెం ముందుకి వంగి "మరి నేను వంటవాణ్ణి మానిపించేను నీకు తెలుసునా?..." అన్నాడు.

"గొప్ప పని చేసేరు... ఇంకానయం భోజనం మానేసేనన్నారు కాదు.... నేను వండగలను లెండి..."

"హుర్రే" అన్నాడు ఆనందంతో సోమశేఖరం. పాప, బాబు వింతపడి చూస్తూ వుండిపోయేరు.

"మరి హక్కులు - సెక్రటరీ షిప్పూ ఏట్సెట్రా...." ఆమె మొహంలోకి చూస్తూ అడిగాడు.

"నో... నో..." "స్త్రీలు .. బాధ్యతలూ" అని వివరించేసేం మా వ్యాసాన్ని.. అన్నది శారద.

"బహుశా శెకరట్రీషిప్పుకి విడాకులిచ్చే ముందు అదే నా అంతిమ గంభీరోపన్యాసం అవుతుంది".

"ఐసీ... అయితే చచ్చామే.... శెక్రటరీ షిప్పు నెవరు భరిస్తారేం?...."

"గంగా భాగీరదీ సమానురాలైన గంగాబాయమ్మగారో, పక్కుబాయమ్మగారో ముందుకు వస్తారు లెండి. మీరు బెంగపడకండి..."

ఇద్దరూ నవ్వుకున్నారు. పాప, బాబుగూడా అర్థం అయినట్లు కిలకిలమన్నారు.

ఆయిద్దర్నీ చెరో చంకని ఎత్తుకుని 'ఛలో' అన్నాడు డాక్టర్ శేఖరం...

తిన్నగా కారు ఎక్కిపోయేరు.

అంతలో తండ్రి వస్తూ "వోయ్! అల్లుడూ! అదేమిటే అమ్మాయ్! చెప్పాచెయ్యకుండా అలా

పోతారేం?" అంటూ కేకలేసేడు.

తాతకి 'టా!టా! చెప్పరా బాబూ" అని శారద వెనక సీట్లో నించి తల యివతలకి పెట్టి బాబు చెయ్యిపట్టుకుని వూపింది.

"తాతకి నువ్వూ చెప్పతల్లీ! టాటా" అని తన చేత్తోటి చంటి దాని చేత కూడా వూపించేడు సోమశేఖరం.

"ఓరి మీ! నా డబ్బుకేనా విలువ లేదట్రా?" అని ఆనంద భాష్పాలు రాల్చేడు, మలుపు తిరిగిపోయిన కారుకేసి చూస్తూ ఆయన !

(1961, ఆంధ్రప్రదేశ్)